

## ఇద్దరిని ప్రేమించి.. పెద్దలను ఒప్పించి

- ఒకే మండపంలో ఇద్దరికి తాళి కట్టిన యువకుడు
- సోషల్ మీడియాలో వైరల్

జైనూర్, ఏప్రిల్ 24 : ఇద్దరమ్మాయిలను ప్రేమించిన ఓ యువకుడు.. ఇరు వర్గాల పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న ఘటన గురువారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం అడ్డేశ్వరలో చోటుచేసుకుంది. అడ్డేశ్వరకు చెందిన ఆత్రం చత్రుశావ్.. అదే గ్రామానికి చెందిన జంగుబాయితో పాటు సాంగ్వికి చెందిన సోన్‌దేవిని నాలుగేళ్లుగా ప్రేమించాడు. చత్రుశావ్ ఆ ఇద్దరి యువతుల పెద్దలను ఒప్పించి, పెండ్లి పత్రికలు అచ్చువేయించి బంధుమిత్రులకు ఆహ్వానం పంపారు. 500 మంది అతిథుల సమక్షంలో గిరిజన సంస్కృతీసంప్రదాయాల నడుమ పచ్చని పందిరిలో ఇద్దరి మెడలో తాళికట్టాడు. ప్రస్తుతం వివాహం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

## హవాలా దందాపై ఈడీ దాడులు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని పలువురు హవాలా వ్యాపారుల ఇండ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం దాడులు చేశారు. గతంలో విదేశీ సిగరెట్ల స్మగ్లింగ్, ఫారిన్ కరెన్సీ, గుట్కా దందా ముసుగులో సాగుతున్న హవాలాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు కేసు నమోదు చేశారు. అప్పట్నుంచీ నిఘా పెట్టిన ఈడీ అధికారులు.. మలక్‌పేట్, బేగంబజార్, సికింద్రాబాద్‌లోని 13 మందికి చెందిన వివిధ ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ దాడుల్లో భారీగా నగదు గుర్తించినట్టు తెలిసింది. ఫారిన్ సిగరెట్ల స్మగ్లింగ్‌లో భారీ మొత్తంలో మనీలాండరింగ్ జరుగుతున్నట్టు ఈడీ ఆధారాలు సేకరించిందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.

# ఖమ్మానికి జలతోరణం!

- ఉమ్మడి జిల్లాకు తలాపునే గోదారి
- ఉమ్మడి పాలనలో ఎండమావులే
- కృష్ణానది నీళ్లందిందీ అంతంతే..
- కేసీఆర్ రీఇంజినీరింగ్‌తో జలసిరి
- 'సీతారామ'కు తుది అనుమతులు
- ఫలిస్తున్న నాటి కేసీఆర్ సంకల్పం

తలాపునే గోదారి ఉన్నా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు నాడు సాగు, తాగునీటికి విలవిల్లాడారు. కృష్ణానది సమీపానే ఉన్నా అంతంత మాత్రంగానే నీటి సదుపాయం కలిగింది. మొత్తంగా ఉమ్మడి పాలనలో సాగునీటి వసతుల కల్పనలో ఈ జిల్లా తీవ్ర అన్యాయానికి గురైంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక ఈ జిల్లా దశ మారింది. కేసీఆర్ ప్రత్యేక చొరవతో నేడు లక్షలాది ఎకరాలకు సాగునీరు అందనున్నది. కరువు పీడిత ప్రాంతాల దాహార్తి తీరుతున్నది. సమీకృత సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు తుది అనుమతులు మంజూరు కావడంతో ఆనాటి కేసీఆర్ సంకల్పం నేడు నెరవేరనున్నది.

హైదరాబాద్, ఏప్రిల్24 (నమస్తే తెలంగాణ): నాటి ఉమ్మడి పాలనలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రతిపాదించిన రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరాసాగర్ ప్రాజెక్టులు నీటి కుట్రలకు నిదర్శనంగా మిగిలాయి. ఈ రెండు ప్రాజెక్టుల్లో ఒకటి అంతర్రాష్ట్ర, మరొకటి వన్యప్రాణి అటవీ ప్రాంతం అనుమతుల సమస్యలతో నిరర్థకంగానే మిగిలిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తెలంగాణ ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్.. రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ఎత్తిపోతల పథకాలను సమీక్షించారు. ఈ రెండు పథకాల్లోని లోపాలు, సాంకేతిక సమస్యలను గ్రహించారు. అంతర్రాష్ట్ర, వన్యప్రాణి అటవీ ప్రాంతం అనుమతుల సమస్యలను శాశ్వతంగా అధిగమించడానికి కేసీఆర్ ఆ రెండు ప్రాజెక్టులను రీఇంజినీరింగ్ చేయించారు. ఒకే సమీకృత ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించి దానికి సీతారామ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేశారు.70 టీఎంసీలను ఎత్తిపోయడం ద్వారా గతంలో ఆ రెండు ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతిపాదించిన ఆయకట్టుతో పాటు అదనంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులైన వైరా, లంకాసాగర్, పాలేరు, బయ్యారం ప్రాజక్టుల కింద 46,187 ఎకరాలు, పాలేరు ప్రాజక్టు ద్వారా నాగార్జున సాగర్ ప్రాజక్టు ఆయకట్టు 2,37,573 ఎకరాల స్థిరీకరణతో చిన్ననీటి చెరువుల కింద 1,35,000 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించేలా పథకాన్ని రూపొందించి తెలంగాణ రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ప్రాజెక్టుగా దీనిని తీర్చిదిద్దారు.

### 26 మండలాలకు సాగు, తాగునీరు

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఖమ్మం జిల్లాలోని 25 మండలాల్లో, వరంగల్ జిల్లాలోని ఒక మండలంలో స్థిరీకరణ సహా మొత్తం 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు, వందలాది గ్రామాలకు తాగునీరు అందనున్నది. 2018 ఫిబ్రవరి 16న ఆనాటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రాజెక్టు పనులకు స్వయంగా శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం సీతారామ లిఫ్ట్ పనులు పూర్తయ్యాయి. ఈ సీజన్‌లో మొదట సత్తుపల్లి కాలువకు నీళ్లిచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి నిరంతరం నీరు అందుబా



టులో ఉండేలా దుమ్ముగూడెం దిగువన 37 టీఎంసీల సామర్థ్యంతో సీఎం కేసీఆర్ సీతమ్మసాగర్ బరాజ్‌ను ప్రతిపాదించారు. పనులు పూర్తయితే మొత్తంగా ఖమ్మం జిల్లా మొత్తం సస్యశ్యామలం కానున్నది.

### అనుమతుల సాధనకు విశేష కృషి

సీతారామ ప్రాజెక్టు అనుమతుల సాధనకు సైతం ఆనాడు కేసీఆర్ సర్కారు విశేష కృషి చేసింది. కేంద్ర జల సంఘం అనేక కొర్రీలు పెట్టినా వాటన్నింటినీ అధిగమిస్తూ ముందుకుపోయింది. వాస్తవంగా కేంద్రం రివర్ బోర్డుల గెజిట్‌ను 2021లో విడుదల చేసింది. దాని ప్రకారం అనుమతులు లేని ప్రాజెక్టులకు 6 నెలల్లో అనుమతులను సాధించుకోవాల్సి ఉన్నది. ఆ మేరకు కేసీఆర ప్రభుత్వం సమీకృత సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు డీపీఆర్‌ను 2022లోనే సీడబ్ల్యూసీకి సమర్పించింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పరిధిలోని హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర నదీ జల విభాగం, సెంట్రల్ వాటర్ కమిషన్, ఇరిగేషన్ ప్లానింగ్, కాస్ట్ అండ్ ఎస్టిమేషన్, భూగర్భజల, పర్యావరణ మంత్రిత్వ, అటవీ, కాలుష్యనియంత్రణ శాఖలు కలిపి మొత్తంగా 18 డైరెక్టరీల నుంచి అనుమతులను సాధించింది. అయితే కేవలం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరించే టెక్నికల్ అప్రయిజల్ కమిటీ తుది అనుమతులే మిగిలిపోయాయి. అనంతరం సుదీర్ఘకాలంపాటు టీఏసీ సమావేశమే కొనసాగలేదు. తాజాగా నిర్వహించిన టీఏసీ సమావేశంలో ప్రాజెక్టుకు తుది అనుమతులు సైతం మంజూరయ్యాయి.

### 'సీతారామ'కు టీఏసీ గ్రీన్‌సిగ్నల్ :ఉత్తమ్

కేంద్ర జలశక్తిశాఖ నేతృత్వంలోని అత్యున్నతస్థాయి టెక్నికల్ అప్రయిజల్ కమిటీ (టీఏసీ) ఎట్టకేలకు సమీకృత సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు తుది అనుమతులకు ఆమోదముద్ర వేసింది. ఢిల్లీలోని ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జి నేతృత్వంలో జరిగిన 158వ టీఏసీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నది. సమావేశానికి తెలంగాణ సాగునీటి పారుదల శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం గోదావరి డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యప్రసాద్ హాజరై ప్రాజెక్టు ప్రత్యేకతలను వివరించారు. దీంతో టీఏసీ కమిటీ తుది అనుమతులు చేసింది. అనుమతుల మంజూరుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తంచేశారు. కేంద్ర జలశక్తి శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఇరిగేషన్ అధికారులను అభినందించారు.

### రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరా రుద్రమకోట ఎత్తిపోతల పథకాల స్వరూపం

| పథకం స్వరూపం | రాజీవ్‌దుమ్ముగూడెం | ఇందిరా రుద్రమకోట | మొత్తం |
|---|---|---|---|
| నీటి కేటాయింపులు | 16.50 టీఎంసీలు | 16.50 టీఎంసీ | 33 |
| అప్రోచ్ చానల్ పొడవు | 18.60 కి.మీ | 15.00 కి.మీ | 33.6 |
| పైపులైన్ పొడవు | 55.68 కి.మీ | 21.70 కి.మీ | 77.38 |
| గ్రావిటీ కాలువ పొడవు | 150.52 కి.మీ | 118.00 కి.మీ | 268.52 |
| పంపుహౌజ్‌ల సంఖ్య | 7 | 3 | 10 |
| విద్యుత్తు వినియోగం | 119.75 (మెగావాట్లు) | 229.10 (మెగావాట్లు) | 348.85 |
| ఆయకట్టు | 2,00,000 (ఎకరాలు) | 1,32,657 (ఎకరాలు) | 3,32,657 (ఎకరాలు) |

### సమీకృత సీతారామ ప్రాజెక్టు వివరాలు

| | |
|---|---|
| నీటిని ఎత్తిపోసే ప్రదేశం | దుమ్ముగూడెం ఆనకట్టకు ఎగువన |
| నీటి పరిమాణం | 70.40టీఎంసీలు |
| ఆయకట్టు | 6.74 లక్షల ఎకరాలు |
| కాలువ డిశ్చార్జి | 9,000 క్యూసెక్కులు |
| గ్రావిటీ కాలువ పొడవు | 243.20 కి.మీ |
| పంపింగ్ కేంద్రాలు | 4 |
| పైప్‌లైన్ల పొడవు | 8.56 కి.మీ |

### సీతమ్మసాగర్ బరాజ్ వివరాలు

| | |
|---|---|
| నిర్మాణ ప్రదేశం | దుమ్ముగూడెం ఆనకట్టకు దిగువన |
| బరాజ్ పొడవు | 1,263 మీటర్లు |
| ఎత్తు | 68 |
| గేట్లు | 52 |
| నీటి నిల్వ సామర్థ్యం | 37 టీఎంసీలు |
| విద్యుదుత్పత్తి | 320 మెగావాట్లు (ప్రతిపాదన) |

## నీళ్లు, నిధులు, నియామకాల్లో సర్కారు విఫలం

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ సర్కారు 17 నెలల పాలనలో నీళ్ల వినియోగం, నిధుల సాధన, నియామకాల్లో విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కృష్ణా నీళ్లను కాపాడటంలో, ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్లను అడ్డుకోవడంలో విఫలమైందని ఎక్స్ వేదికగా విమర్శించారు. రూ.8,929 కోట్ల రుణ విముక్తి చేయకపోవడం సర్కారు పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడంలో విఫలమైందని విమర్శించారు. అన్నింటా వెనుకబడి పోవడమే కాంగ్రెస్ సర్కారు విజన్ అని దెప్పిపొడిచారు.

## రూ.30 కోట్లు ఖర్చు.. లగ్జరీ ఏర్పాట్లు!

- భారత్ సమ్మిట్‌కు హంగామా
- కాంగ్రెస్ సర్కారు తీరుపై విమర్శల వెల్లువ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): రెండు రోజులు.. 100 దేశాల నుంచి 400 మంది ప్రతినిధులు.. స్టార్ హోటళ్లలో బస ఏర్పాట్లు... వెరసి రూ.30 కోట్లకుపైగా ఖర్చు. ఇవీ తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్-2025 కార్యక్రమ విశేషాలు. కాంగ్రెస్ ఎజెండాలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు శుక్రవారం ప్రారంభంకానున్నది. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తూ నిర్వహిస్తున్న సదస్సు వల్ల తెలంగాణ ప్రజలకు, ఒనగూరె ప్రయోజనం ఏమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఎజెండాను అమలుచేసేందుకు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారత్ సమ్మిట్ ఎజెండాను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతున్నది. దేశంలో రాజ్యాంగం పరిరక్షణ, ప్రజాస్వామ్యం, సమన్యాయం తదితర అంశాలపై భారత్ సమ్మిట్‌లో చర్చిస్తామని మంత్రులు చెప్తున్నారు. అంతర్జాతీయ స్థాయి సదస్సు పెట్టి ఇలాంటి అంశాలపై చర్చించడం ఏంటనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### అప్పుడు తెలంగాణపై.. ఇప్పుడు దేశంపై..?

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి తెలంగాణ అప్పుల పాలైందని, దివాలా తీసిందని ప్రచారం చేస్తున్నది. తద్వారా దేశ, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ఖ్యాతిని దెబ్బతీసిందనే విమర్శలున్నాయి. అప్పుల పేరుతో నిన్న, మొన్నటివరకు తెలంగాణను బద్నాం చేసిన కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో దేశాన్ని నవ్వులపాలు చేయాలనే కంకణం కట్టుకున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మన దేశంలో జరుగుతున్న పరిణామాలు, రాజకీయ పరిస్థితులపై అంతర్జాతీయ సదస్సు పెట్టి మరీ చర్చించాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న వినిపిస్తున్నది. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధుల ముందు భారత్‌ను తక్కువ చేసి చూపుతారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదంటూరాహుల్‌గాంధీ ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు అదే ప్రచారాన్ని అంతర్జాతీయ సదస్సులో చర్చించనున్నట్టు తెలుస్తున్నది. ఈ సదస్సుకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ ముఖ్యులు హాజరై ప్రసంగించనున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ సమావేశం కాకుండా ప్రభుత్వ సమావేశం ఎలా అవుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### రూ.30 కోట్లకుపైగా ఖర్చు?

భారత్ సమ్మిట్‌కు వంద దేశాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతారని ప్రభుత్వం చెప్తున్నది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లకు అయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తున్నట్టు సమాచారం. ఈ సదస్సును హెచ్ఐసీసీ నోవెటాల్ హోటల్‌లో నిర్వహించనున్నారు. దేశ, విదేశాల నుంచి వస్తున్న అతిథులకు స్టార్ హోటళ్లలో లగ్జరీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకు రూ.30 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలున్నాయి. ఈ నిధులను మొత్తం తెలంగాణ సర్కారే భరిస్తున్నట్టు తెలిసింది. రైతులకు పరిహారం, రైతుభ రోసా, రుణమాఫీకి డబ్బుల్లేవంటున్న సర్కారు.. రాష్ట్ర ప్రజలకు ఉపయోగంలేని సదస్సుకు రూ.30 కోట్లు పెట్టి నిర్వహించడం ఏంటనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## శ్రీరాం కర్రిపై ప్రెస్ కౌన్సిల్ విచారణ

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ కొణతం దిలీప్ వెల్లడి
- తన ఫిర్యాదుపై ఎట్టకేలకు జవాబు లభించిందని వ్యాఖ్య

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): డెక్కన్ క్రానికల్ దినపత్రికకు రెసిడెంట్ ఎడిటర్‌గా ఉంటూనే కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి మీడియా కన్సల్టెంట్‌గా పనిచేసిన శ్రీరాం కర్రి మీద ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విచారణ చేపట్టిందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ కొణతం దిలీప్ తెలిపారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు తాను చేసిన ఫిర్యాదుపై ఎట్టకేలకు జవాబు వచ్చిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మీద విచారణ చేపట్టిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.. దీనికి కేస్ నంబర్ 656/2024/ఏ-పీసీఐ ఇచ్చి, మరికొంత సమాచారం పంపించాలని తనకు లేఖ రాసిందని తెలిపారు. వారు అడిగిన సమాచారం ఒకటి రెండు రోజుల్లో పంపిస్తానని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఓ వైపు డెక్కన్ క్రానికల్ దినపత్రికకు శ్రీరాం కర్రి రెసిడెంట్ ఎడిటర్‌గా ఉంటూనే, మరోవైపు 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి మీడియా సలహాదారుగా పది నెలలపాటు అనధికారికంగా వ్యవహరించారు. 2024 జనవరిలో దావోస్, ఆ తరువాత లండన్, అమెరికా వెళ్లిన తెలంగాణ ప్రతినిధి బృందంతో ఆయన వెళ్లడం పత్రికా విలువలకు, మీడియా నిష్పాక్షికతకు పాతర వేసే చర్య' అని పేర్కొంటూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసినట్టు దిలీప్ తెలిపారు. ఆ ఫిర్యాదు చేశాక శ్రీరాం కర్రి.. 2024 ఆగస్టులో డెక్కన్ క్రానికల్ పత్రికలో రెసిడెంట్ ఎడిటర్ పదవికి రాజీనామా చేశారని పేర్కొన్నారు.

# ఇంటర్ జవాబుపత్రం గల్లంతు?

- మూల్యాంకనంలో భారీ తప్పిదం
- ఆన్సర్‌షీట్‌ను దిద్దని వైనం
- ఫలితాలు చూసి నివ్వెరపోయిన విద్యార్థి, అధికారులకు వినతులు
- ఆందోళనతో ఇంటర్మీడియట్ బోర్డు చుట్టూ ప్రదక్షిణలు
- అధికారుల నుంచి నిర్లక్ష్యపు సమాధానాలు, విద్యార్థిని ఆవేదన



హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఇటీవల టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనంలో భారీ తప్పిదాలను మూటగట్టుకున్న సర్కార్‌కు మరో మరక అంటుకునేలా ఉన్నది. ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం కూడా లోపాల పుట్టను తలపిస్తున్నది. ఏటా ఏదో ఒక తప్పిదం వెలుగు చూస్తుండగా, ఈసారి భారీ తప్పిదమే బయటికొచ్చింది. ఏకంగా ఓ విద్యార్థిని జవాబుపత్రమే గల్లంతవడంతో మూల్యాంకనం చేయనేలేదు, ఫలితాన్ని వెల్లడించనూలేదు. ఫలితాల్లో ఇన్‌వ్యాలిడ్ అని చూపించినా అధికారులు తప్పును దిద్దుకోలేకపోయారు. బాధిత విద్యార్థిని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. అధికారులను వెళ్లి కలిస్తే వారి నుంచి నిర్లక్ష్యపు సమాధానమే ఎదురైంది. 'ఎందుకిలా జరిగింది, పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకుంటారా? అని బాధితురాలి తండ్రి ప్రశ్నిస్తే.. 'ఇంతకంటే ఎక్కువ మాట్లాడకు' అంటూ బెదిరించడం సదరు అధికారి వంతయింది. సీహెచ్ దిశ అనే విద్యార్థిని హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తిచేసింది. ఫస్టియర్‌లో ఇంగ్లిష్, సెకండియర్‌లో బోటనీ, జువాలజీ పేపర్లు తప్పింది. ఈ పేపర్లకు దిశ మార్చిలో నిర్వహించిన వార్షిక పరీక్షలకు హాజరైంది. మంగళవారం ఇంటర్ ఫలితాలు విడుదల కాగా, తన ఫలితాల కోసం వెబ్‌సైట్‌లో పలుమార్లు చూసినా 'ఇన్‌వాలిడ్' అని వచ్చింది. దీంతో నివ్వెరపోయిన దిశ చివరికి ఏం జరిగిందో తెలుసుకోవడానికి కాలేజీకి పరుగులు పెట్టింది. కాలేజీలో ఆరా తీస్తే, అక్కడి కాలేజీ ప్రిన్సిపాల్ సూచనలతో దిశ తండ్రి బుధ, గురువారాల్లో ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయానికి వెళ్లినా ఫలితం దక్కలేదు. తెలిసిన వారి ద్వారా ఓ ఉన్నతాధికారిని కలువగా, దిశ ఇంగ్లిష్ పేపర్‌ను మూల్యాంకనమే చేయలేదని పరిశీలనలో తేలింది. ఇంతకు దిశ ఇంగ్లిష్ జవాబుపత్రం ఎక్కడుంది? ఏ మూల్యాంకన క్యాంపులో గల్లంతైంది. దీనికి కారకులెవరు? ఎవరి నిర్లక్ష్యంతో ఇలా జరిగింది? అంటే సమాధానాలు మాత్రం లేవు.

### వీరి పరిస్థితి ఏమిటో?

ఈసారి ఇంటర్‌లో ఏకంగా 10 మంది విద్యార్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో పెట్టారు. ఫస్టియర్‌లో నలుగురు, సెకండియర్‌లో ఆరుగురి ఫలితాలు ఉన్నాయి. సెకండియర్‌లో ఒక రెగ్యులర్ విద్యార్థి, నలుగురు ప్రైవేట్ విద్యార్థులు, ఒక ఒకేషనల్ విద్యార్థి ఉన్నారు. దిశ పేపర్ గల్లంతయిందన్న వార్తల నేపథ్యంలో ఈ 10 మంది విషయంలోనే ఏం జరిగి ఉంటుందన్న అనుమానాలు వస్తున్నాయి. వీరిలో ఎవరివైనా జవాబుపత్రాలు గల్లంతయ్యాయా? లేక మరేమైనా కారణం దాగి ఉన్నదా? అన్న సందేహాలు తొలుస్తున్నాయి.

### పరిమితికి మించి పేపర్ల మూల్యాంకనం

ఈసారి మూల్యాంకనాన్ని త్వరగా పూర్తిచేయాలని ఒక్కో ఎగ్జామినర్‌కు పరిమితికి మించి పేపర్లు ఇచ్చారు. వివిధ కేంద్రాల్లో రోజుకు 45 నుంచి 60 వరకు జవాబుపత్రాలు ఇచ్చిన ఉదంతాలు ఉన్నాయి. వాస్తవానికి 40 జవాబు పత్రాలే ఇవ్వాల్సి ఉండగా, త్వరగా ముగించాలన్న లక్ష్యంతో ఎక్కువ ఇచ్చారు. ఈ కారణంగా కూడా లోపాలు తలెత్తినట్టు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో జరిగిన తప్పిదాల నేపథ్యంలో ఈసారి ఇంటర్‌బోర్డు కొత్తగా వెరిఫికేషన్ చేయించినా, ఇలాంటి తప్పిదాలు చోటుచేసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

## మంత్రివర్గ విస్తరణ ముఖ్యమంత్రి కోర్టులోనే

**కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): మంత్రివర్గ విస్తరణ ముఖ్యమంత్రి కోర్టులోనే ఉందని కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ తేల్చిచెప్పారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో హాట్‌టాపిక్‌గా మారాయి. మొన్నటిదాకా క్యాబినెట్ విస్తరణ అంశం హైకమాండ్ చేతిలో ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తూ వచ్చారు. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులనే మంత్రిపదవి వరిస్తుందని.. ఆ నేతలు ఎవరో నిర్ణయించేది మాత్రం అధిష్ఠానమే అంటూ పదే పదే చెప్పారు. ఇప్పుడు మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త చర్చకు తెరలేపాయి. మంత్రి పదవి కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఆశావహులు పెరిగిపోయారు. ఇప్పట్లో క్యాబినెట్ విస్తరణ కష్టమేనన్న సంకేతాలతో కొన్నాళ్లుగా వారంతా సైలెంట్ అయిపోయారు. కానీ మీనాక్షీనటరాజన్ చేసిన వ్యాఖ్యతో పార్టీలో మళ్లీ అలజడి మొదలైంది.

## కార్ల కంటే హెలికాప్టర్ ప్రయాణమే తక్కువ ఖర్చు

**కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి**

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వానికి ఖర్చులు తగ్గించడానికే మంత్రులు హెలికాప్టర్లలో పర్యటిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. మంత్రుల హెలికాప్టర్ పర్యటనల మీద వస్తున్న విమర్శలపై ఆయన స్పందించారు. ముగ్గురు, నలుగురు మంత్రులు కలిసి పర్యటనలకు వెళ్తే కాన్వాయ్‌లో పదుల సంఖ్యలో కార్లు ఉంటాయని, వాటితో ఆర్థిక భారం ఎక్కువుంటుందని పేర్కొన్నారు. అందుకే హెలికాప్టర్‌లో వెళ్తున్నారని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. సుదూర ప్రాంతాల్లో రెండు, మూడు కార్యక్రమాలుంటే మాత్రమే మంత్రులు హెలికాప్టర్లను వాడుతున్నారని తెలిపారు. హెచ్‌సీయూ విషయంలో ఏఐ చిత్రాలతో తప్పుడు ప్రచారం వల్లే బుల్డోజర్‌కు, జేసీబీకి తేడా తెలియకుండా ప్రధాని మోదీ మాట్లాడారని విమర్శించారు.

# కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్!

- ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి
- బీజాపూర్ జిల్లా ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో ఘటన



కర్రెగుట్టల సమీప ప్రాంతం నుంచి బయలుదేరిన వాయుసేన హెలికాప్టర్

ములుగు, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ)/ కొత్తగూడెం ప్రగతిమైదాన్: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భద్రతాబలగాలకు, మావోయిస్టులకు మధ్య గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా నక్సలైట్లు చనిపోయినట్టు బస్తర్ ఐటీ సుందర్‌రాజ్ ధ్రువీకరించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేతలే లక్ష్యంగా కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో జల్లెడపడుతున్న భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయనేది పోలీసుల కథనం. అయితే, ఈ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయినట్టు తొలుత ప్రచారం జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ఉద్ధృతం చేసిన నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన అగ్రనేతలు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో విస్తరించి ఉన్న కర్రెగుట్టల్లో తలదాచుకుంటున్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టినట్టు వార్తలొస్తున్నాయి. మూడు రోజులుగా సీఆర్పీఎఫ్, కోబ్రా, ఎస్టీఎఫ్, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, బీఎస్ఎఫ్ బలగాలు వేల సంఖ్యలో మోహరించి అడవులను జల్లెడ పడుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. మంగళవారం ప్రారంభమైన 'కర్రెగుట్టల ఆపరేషన్'లో భద్రతా బలగాలకు చెందిన సుమారు పది వేల మంది పోలీసులు పాల్గొంటున్నట్టు సమాచారం. మావోయిస్టు అగ్రనేతలు బడే చొక్కారావు అలియాస్ దామోదర్, మాస్టర్ మైండ్ హిడ్మా, దేవా, వికాస్ తదితరులు కర్రెగుట్టల్లో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం అందడంతో వారిని టార్గెట్‌గా చేసుకుని ఈ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా ఆ ప్రాంతంలో హెలికాప్టర్ శబ్దాలతోపాటు కాల్పుల మోతలు వినిపిస్తున్నాయని సమీప గ్రామాల ప్రజలు చెప్తున్నారు.



కూంబింగ్‌లో పోలీస్ బలగాలు

### 15 మంది జవాన్లకు వడదెబ్బ

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 24: మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కేంద్ర బలగాలు గత నాలుగు రోజులుగా కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న నేపథ్యంలో 15 మంది జవాన్లు వడదెబ్బకు గురైనట్టు తెలిసింది. గురువారం అస్వస్థతకు గురైన వారిని హెలికాప్టర్ సహాయంతో ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలోని హెలిప్యాడ్ వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ దవాఖానకు తరలించినట్టు సమాచారం. కాగా, 15 మంది జవాన్ల ఆరోగ్య పరిస్థితిపై క్లారిటీ రాలేదు. పోలీసులు ప్రభుత్వ దవాఖానలోకి మీడియాతోపాటు ఎవరినీ అనుమతించడం లేదు. ఇందుకు సంబంధించిన వివరాలను సైతం పోలీసులు వెల్లడించలేదు. వడదెబ్బకు గురైన జవాన్లందరికీ వైద్యులు చికిత్స అందిస్తున్నట్టు సమాచారం. అయితే, కర్రెగుట్టల్లో మావోయిస్టులకు, కేంద్ర బలగాలకు మధ్య జరుగుతున్న ఎదురుకాల్పుల్లో జవాన్లు గాయపడ్డారా? లేదా మండుతున్న ఎండల కారణంగా వడదెబ్బకు గురై అనారోగ్యం పాలయ్యారా? అనేది తెలియాల్సి ఉన్నది.



వరంగల్‌లో లొంగిపోయిన మావోయిస్టులను మీడియా ముందు ప్రవేశపెట్టిన డీఐజీ

## 14 మంది మావోయిస్టుల లొంగుబాటు

**మల్టీజోన్ డీఐజీ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి**

సుబేదారి, ఏప్రిల్ 24: మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది సభ్యులు హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో గురువారం లొంగిపోయారు. మల్టీజోన్ డీఐజీ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఇద్దరు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఏరియా కమిటీ సభ్యులున్నారు. వీరిలో మడవి అంద అలియాస్ రాజేశ్.. కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్‌కి ప్రొటెక్షన్ టీం సభ్యుడిగా పనిచేశాడు. లొంగిపోయిన వారిలో మరో ఏరియా కమిటీ సభ్యురాలు పోడియ కోసి, మిలిషియన్ సభ్యులు మరకం హిడమే అలియాస్ కోవాసి, పోడియం భూమిక అలియాస్ సోడి కోసి, సోడి బుద్రి ఆలియాస్ బద్రి, మడవి పూజే, హేమ్లా సోను, సోడి రమేశ్, బుద్ర, కోర్సా లాలు, హేమ్లా బుద్ర, మేమ్లా సుక్కు, కోర్సా సుక్కు ఉన్నారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు 250 మంది మావోయిస్టులు లొంగిపోయినట్టు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మావోలు జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన సూచించారు. లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం పునరావాసాన్ని కల్పిస్తుందని చెప్పారు. 14 మందికి రూ.25 వేల చొప్పున రివార్డును ఆయన అందజేశారు. మావోయిస్టుల లొంగుబాటు కార్యక్రమంలో ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

### కర్రెగుట్టల ఆపరేషన్‌తో సంబంధం లేదు

ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో జరుగుతున్న ఆపరేషన్‌తో తెలంగాణ పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కర్రెగుట్ట ఆపరేషన్‌పై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. కర్రెగుట్ట ఆపరేషన్‌లో కేంద్ర బలగాలు మాత్రమే పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ ఆపరేషన్‌తో తెలంగాణ పోలీసులకు సంబంధం లేదని, దానికి సంబంధించిన ఎలాంటి సమాచారం తమ వద్ద లేదని స్పష్టంచేశారు. తెలంగాణ నుంచి ఇంకా 95 మంది అజ్ఞాత జీవితంలో ఉన్నారని డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ పాల్గొన్నారు.